సాక్షి
కాకినాడ
ఆదివారం । 29 । అక్టోబర్ । 2023



రూ.8 లక్షల విరాళం

అన్నవరం: సత్యదేవుని నిత్యాన్నదాన పథకానికి హనుమాన్ జంక్షన్‌కు చెందిన దాత నారగాని వెంకటేశ్వరమ్మ రూ.8 లక్షల విరాళాన్ని దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్‌కు శనివారం అందజేశారు.



డెల్టాలకు నీరు విడుదల

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్ నుంచి శనివారం 14,100 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పుడెల్టాకు 4,300, మధ్యడెల్టాకు 2,600, పశ్చిమడెల్టాకు 7,200 క్యూసెక్కులు వదిలారు.

అక్రమ మార్గంలో ఆర్జించాలని..



అధిక సొమ్ముకు ఆశ పడ్డారు.. అక్రమ మార్గంలో ఆర్జించాలని ఎత్తులు వేశారు.. చివరికి పోలీసులకు చిక్కి కటకటాల పాలయ్యారు. హర్యానా మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్న ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేసిన ఘటన రాజమహేంద్రవరంలో చోటుచేసుకుంది.

8లో

న్యూస్‌రీల్

ఇరిగేషన్ అధికారులూ.. అప్రమత్తం



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ కృతికాశుక్లా

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): జిల్లాలో వరి చివరి దశలో ఉన్నందున రైతులకు సాగునీరు కొరత లేకుండా ఇరిగేషన్ అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి ఉన్నతస్థాయి అధికారులతో కలిసి అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జేసీలతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ కృతికాశుక్లా, జేసీ ఎస్.ఇలక్కియా, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు. వివిధ శాఖల అధికారులతో సాగిన సమావేశం అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సాగునీరు కొరత లేకుండా, శివారు ప్రాంతాలకు కూడా అందేలా అధికారులు పటిష్ఠ చర్యలు తీసుకోవాలన్నారు. కాన్ఫరెన్స్‌లో జెడ్పీ సీఈఓ ఎ.రమణారెడ్డి, వ్యవసాయశాఖ జేడీ ఎన్.విజయ్‌కుమార్, డ్వామా పీడీ వెంకటలక్ష్మి, సహకారశాఖాధికారి దుర్గాప్రసాద్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రహణ కాలంలో కుక్కుటేశ్వరునికి అభిషేకాలు



పాదగయ క్షేత్రంలో కుక్కుటేశ్వరస్వామి

పిఠాపురం: స్థానిక పాదగయ క్షేత్రంలో ఆలయ ఆచారం ప్రకారం గ్రహణ సమయంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. శనివారం అర్ధరాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించనున్నట్లు ఈఓ శ్రీనివాసరావు తెలిపారు. పూర్వ ఆచారం ప్రకారం గ్రహణ పట్టు, విడుపు అభిషేకాలు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కాగా నియోజకవర్గంలోని అన్ని ప్రముఖ ఆలయాలతో పాటు ఇతర ఆలయాలను శనివారం రాత్రి 7 గంటలకే మూసివేశారు.

సెంట్రల్ జైలులో ఖైదీలకు వైద్య సేవలు



వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్లు

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్థానిక సెంట్రల్ జైలులో శనివారం రెండోరోజు జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం కొనసాగింది. కలెక్టర్ కె.మాధవీలత ఆదేశాల మేరకు మెడికల్ అండ్ హెల్త్ డిపార్టుమెంట్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక మహిళా కారాగారంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రిమాండ్ ఖైదీలు 1,025 మందికి, మహిళలు 156 మందికి వైద్య సేవలు అందించారు. జైలు సూపరింటెండెంట్లు ఎస్.రాహుల్, వసంతి కుమారి మాట్లాడుతూ మహిళా కారాగారంలో శిబిరం నిర్వహించడంపై ముఖ్యమంత్రి జగన్, కలెక్టర్ మాధవీలతకు కృతజ్ఞతలు తెలిపారు. కారాగారంలోనే శిబిరాన్ని నిర్వహించడం ద్వారా ఖైదీలకు ఆరోగ్య భరోసా కల్పించారన్నారు. సాధారణ చికిత్స అవసరం అయిన వారికి పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వడం జరిగిందన్నారు. గుండె, జనరల్, ఎముకలు, దంత, ఈఎన్‌టీ, సైకాలజీ విభాగాల్లో స్పెషలిస్ట్ డాక్టర్లు, సిబ్బంది సేవలు అందించారన్నారు. కార్యక్రమంలో కారాగార వైద్యాధికారులు డాక్టర్ పీతాని కోమల, హారిక, రవి కుమార్, జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

భద్రంగా.. నమ్మకంగా..



ప్రైవేట్ కొరియర్ సేవలకు దీటుగా ప్రభుత్వ నిర్వహణలోని ఏపీఎస్‌ఆర్టీసీ కార్గో సేవలను విస్తరించింది. ఇంతవరకు ప్రయాణికులను గమ్య స్థానాలకు చేర్చడం, సరుకు రవాణాకే పరిమితమైన ఆర్టీసీ ఇప్పుడు మరో అడుగు ముందుకేసి సేవలను ప్రజలకు మరింత చేరువ చేస్తోంది. మన రాష్ట్రంలోని దాదాపు 84 ప్రాంతాల్లో తక్కువ ఖర్చుతోపాటు భద్రంగా ఇంటికి సరుకు చేరవేసే దిశగా ప్రయత్నాలను వేగవంతం చేసింది.

కార్గో ధరలు ఇలా..

పార్శిల్ బరువు(కిలో)	చార్జి
01	రూ.18
06	రూ.30
10	రూ.36
25	రూ.48
25–50	రూ.59



ఆర్టీసీ ద్వారా వినియోగదారుని ఇంటివద్దకే పార్శిల్ అందజేత

- ఇక ఇంటి వద్దకే ఆర్టీసీ కార్గో సేవలు
- అమల్లోకి డోర్ డెలివరీ విధానం
- రోజూ 2 వేల సరకుల చేరవేత
- తొలి విడత నాలుగు ప్రాంతాల్లో అమలు
- తక్కువ ఖర్చు–భద్రతకు భరోసా

కాకినాడ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ డోర్ డెలివరీ సేవలందించే దిశగా చర్యలు ప్రారంభించింది. ఇంతకాలం మారుమూల గ్రామాలకు ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చిన ఆర్టీసీ చాలా కాలం క్రితమే కార్గోసేవా రంగంలో అడుగుపెట్టింది. మారిన పరిస్థితులు, ప్రజల అవసరాలకు అనుగుణంగా ఆర్టీసీ తన పంథా మార్చుకుంది. ప్రజలకు మరింత సేవలను విస్తరించేందుకు నిర్ణయం తీసుకుంది. ఈ క్రమంలో జిల్లా పరిధిలో కార్గో డోర్ డెలివరీ విధానాన్ని తాజాగా అమలులోకి తీసుకొచ్చింది. ప్రైవేటు కొరియర్ సర్వీసులకు ఏ మాత్రం తీసిపోని విధంగా నమ్మకం కలిగించేలా సేవలకు మెరుగులు దిద్దుతోంది.

తొలి విడత నాలుగు చోట్ల...

కార్గో డోర్ డెలివరీలో భాగంగా తొలి విడత కాకినాడతోపాటు తుని, అన్నవరం, సామర్లకోట ప్రాంతాల్లో డోర్ డెలివరీ సేవలను ప్రారంభించింది. ఆయా కేంద్రాలకు 10 కిలోమీటర్ల పరిధిలో ప్రజలు అందించిన కవర్లు, పార్శిళ్లు, ఇతర సరుకును భద్రంగా చేరవేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. జిల్లాలోని పిఠాపురం, పెద్దాపురంతోపాటు మరికొన్ని ఇతర మండల కేంద్రాల్లో కూడా ఈ సేవలను విస్తరించే దిశగా ఆర్టీసీ ప్రయత్నాలను వేగవంతం చేసింది.

ప్రైవేటు సంస్థ నిర్వహణ

ఆర్టీసీ డోర్ డెలివరీ సేవలను సింగు సొల్యూషన్స్ సంస్థ చేపట్టింది. ప్రైవేటు సంస్థ నిర్వహణలో కొరియర్ సేవలను విస్తరిస్తున్నప్పటికీ దీనిపై పూర్తి పర్యవేక్షణ మాత్రం ఆర్టీసీ చేస్తోంది. ఎక్కడైనా పార్శిల్ మిస్‌కావడం, ఇతర ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించే దిశగా ప్రత్యేక విభాగం కూడా పనిచేస్తోంది. రోజూ మూడు కేంద్రాల పరిధిలో సుమారు రెండు వేల పార్శిల్స్‌ను విజయవంతంగా ప్రజలకు చేరవేస్తోంది. ఇందుకు ధరను కూడా నామమాత్రంగానే వసూలు చేయాలని నిర్ణయించింది. ప్రజలకు భారం లేకుండా సురక్షితంగా సరుకు చేరవేయడమే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన ఈ కార్గో డోర్ డెలివరీ విధానానికి మంచి స్పందనే కనిపిస్తోంది.

మరిన్ని ప్రాంతాల్లో విస్తరణ

డోర్ డెలివరీ సేవలను మరికొన్ని ప్రాంతాలకు కూడా విస్తరించేందుకు ఆర్టీసీ ప్రయత్నాలు ప్రారంభించింది. ఇప్పటికే ప్రారంభించిన ప్రాంతాల్లో డెలివరీ బాయ్స్ ద్వారా వేగంగా సరుకులు అందిస్తోన్న విధానం విజయవంతంగా సాగడంతో ఇతర ప్రాంతాలకు ఈ విధానాన్ని కొనసాగించే దిశగా ప్రయత్నాలు ప్రారంభించింది. సరుకు రవాణాలో కూడా కొన్ని పరిమితులు విధించారు. పెట్రోలియం ఉత్పత్తులు, పేలుడు పదార్థాలు, డ్రైఫిష్‌తో పాటు నిషేధిత వస్తువులు ఏవీ రవాణాకు అనుమతించడంలేదు. ఆ మేరకు ఉన్నతాధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు అందాయి. ఇక ప్రజల నుంచి తీసుకున్న సరుకును 12 నుంచి 24 గంటలలోపుగా చేరవేసేలా స్పష్టమైన కార్యాచరణతో ముందుకు వెళ్తున్నారు. ఏపీలోని దాదాపు 84 కేంద్రాలలో ఎక్కడికైనా సరుకును ఇంటివద్దకే చేరవేసేందుకు చర్యలు చేపట్టారు.

విస్తృత ప్రచారం

డోర్ డెలివరీ సేవలను మరింత విస్తృతం చేసే క్రమంలో దీనిపై ప్రజల్లో విస్తృత ప్రచారం చేస్తున్నారు. బ్యాంకులు, ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య సముదాయాలు, విద్యాసంస్థలు, బహుళ అంతస్తుల భవనాలకు వెళ్లి డోర్ డెలివరీ సేవలను ప్రజలకు అర్థమయ్యేలా వివరిస్తున్నారు. వీటితో పాటు ఫ్లెక్సీలు, కరపత్రాలు, ఆడియో, వీడియో ద్వారా ప్రచారం చేస్తున్నారు.

ప్రజలకు ప్రయోజనం



ఆర్టీసీ ద్వారా చేపట్టిన కార్గో డోర్‌డెలివరీ సేవలు ప్రజలకు ఎంతో ప్రయోజనకరం. వారు కోరిన చోటకు సరుకు చేరవేస్తున్నాం. 84 ప్రాంతాలకు అతితక్కువ సొమ్ముతో భద్రంగా సరుకును చేరవేస్తున్నాం. రానున్న రోజుల్లో జిల్లా పరిధిలోని మిగిలిన పట్టణాలు, మండల కేంద్రాలకు కూడా ఈ సేవలను విస్తరించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. ప్రజలకు చేరువుగా మెరుగైన సేవలు అందించాలన్నదే ఆర్టీసీ లక్ష్యం.

– ఎం.శ్రీనివాసరావు, జిల్లా ప్రచార రవాణాధికారి, కాకినాడ

ఫ్లషింగ్ ఆపరేషన్ విజయవంతం



ఫ్లషింగ్ ఆపరేషన్‌ను ప్రారంభిస్తున్న ఈఈ కాశీ విశ్వేశ్వరరావు

ధవళేశ్వరం: వరదల సీజన్ అనంతరం జరిపే ఫ్లషింగ్ ఆపరేషన్‌ను ధవళేశ్వరం తూర్పు డెల్టా స్కవర్ స్లూయిజ్ వద్ద విజయవంతంగా నిర్వహించారు. హెడ్‌వర్క్స్ ఈఈ ఆర్.కాశీ విశ్వేశ్వరరావు శనివారం ఉదయం గేట్ల స్విచ్చాన్ చేసి నీరు విడుదల చేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఒకేసారి స్కవర్ స్లూయిజ్ గేట్ల ద్వారా నీటిని విడుదల చేయడంతో గేట్ల వద్ద పేరుకుపోయిన మట్టి దిగువకు కొట్టుకుపోయింది. శనివారం 11,531 క్యూసెక్కుల నీటిని ఫ్లషింగ్ ఆపరేషన్ ద్వారా దిగువకు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఈఈ కాశీ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ రబీ సాగునీటి సరఫరాలో ఇబ్బందులు లేకుండా ఫ్లషింగ్ ఆపరేషన్‌ను నిర్వహిస్తున్నామన్నారు. వరదల సీజన్‌లో ఎగువ నుంచి కొట్టుకువచ్చి బ్యారేజ్ గేట్ల వద్ద పేరుకుపోయిన మట్టి.. ఫ్లషింగ్ ఆపరేషన్ ద్వారా దిగువకు కొట్టుకుపోతుందన్నారు. ఇప్పటికే పశ్చిమ, మధ్య డెల్టా స్కవర్ స్లూయిజ్‌ల వద్ద ఫ్లషింగ్ ఆపరేషన్ నిర్వహించామన్నారు. శనివారం తూర్పు డెల్టా స్కవర్ స్లూయిజ్ వద్ద నిర్వహించిన కార్యక్రమంతో ఈ ప్రక్రియ పూర్తయ్యిందన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ అద్దంకి సాయిరాం, కె.నాగలక్ష్మి, బి.చైతన్యకుమార్, రాజేష్, బ్రహ్మజీ, విక్రమ్, ఏసుబాబు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

ప్రజా విశ్వాసానికి దూరమైన చంద్రబాబు

- రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా
- తునిలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దాడిశెట్టి రాజా

తుని: ప్రజలను మాయమాటలతో నమ్మించి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు తర్వాత ప్రజలను నిలువునా ముంచారని, అందుకే ప్రజల నమ్మకాన్ని కోల్పోయారని రాష్ట్ర రోడ్లు భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. తుని పట్టణంలోని క్షత్రియ పరిషత్ భవనం ఆవరణలో శనివారం వైఎస్సార్ సీపీ తుని పట్టణ శాఖ అధ్యక్షుడు రేలంగి రమణాగౌడ్ ఆధ్వర్యంలో ఏపీకి జగనే ఎందుకు కావాలి (వై ఏపీ నీడ్స్ జగన్) కార్యక్రమం నిర్వహించారు. మంత్రి దాడిశెట్టి రాజా ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చంద్రబాబు జైలులో ఉండి ఎల్లో మీడియా, దత్తపుత్రుడుతో మొసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. ప్రజలకు చంద్రబాబు నిజస్వరూపం తెలిసి నమ్మడం లేదన్నారు. 2014 ఎన్నికల్లో దత్తపుత్రుడు, బీజేపీతో కలిసి చంద్రబాబు అమలుకు నోచుకోని హామీలతో అధికారంలోకి వచ్చి ప్రజలు, మహిళలను దగా చేశాడన్నారు. టీడీపీ పాలనలో వేల కుటుంబాలు సర్వనాశనం అయ్యాయరన్నారు. పంట, డ్వాక్రా రుణాలు మాఫీ చేయలేదని, దీంతో 2019 ఎన్నికల్లో చంద్రబాబును ప్రజలు నమ్మలేదన్నారు. దోమలపై దండయాత్ర, రెయిన్‌గన్, స్కిల్ డెవలప్‌మెంట్ స్కీంలో ప్రజా ధనాన్ని దోచుకున్నాడని విమర్శించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల మేనిఫెస్టోను వంద శాతం అమలు చేసి చరిత్రను తిరగరాశారన్నారు. ప్రజలకు జరిగిన మంచిని వలంటీర్లు, గృహ సారథులు ఇంటింటికీ వెళ్లి వివరించాలని సూచించారు. ప్రభుత్వ పరంగా వలంటీర్లు అందిస్తున్న సేవలు ప్రజలతో వీరిని మమేకం చేశాయన్నారు. వలంటీర్లు రాజకీయ నాయకులు కావడానికి ఇది చక్కని అవకాశమన్నారు. ప్రజల ఓట్లతో గెలిచి పదవులు అనుభవిస్తున్న కొందరు పెత్తనం చేస్తున్నారని, ఇది మంచి పద్ధతి కాదని, ప్రజలు లేకపోతే మనం లేమన్న విషయాన్ని గమనించాలన్నారు. అందరూ సమష్టిగా కలిసి పని చేస్తే మళ్లీ మనదే విజయమని గుర్తించుకోవాలన్నారు. ఆరాచక పాలనకు అవకాశం ఇవ్వవద్దని హెచ్చరించారు. తునిలో త్వరలో రాష్ట్ర స్థాయి బీసీ, ఎస్సీ, ఎస్టీ గర్జన సదస్సులు నిర్వహిస్తామని చెప్పారు. మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, వైఎస్సార్ సీపీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కుసుమంచి సుబ్బరాయులు, గాం. దీసత్రం చైర్మన్ అనిశెట్టి సూర్యచక్రరెడ్డి, జెడ్‌ఆర్ యూసీసీ సభ్యుడు బోడపాటి శ్రీను, మున్సిపల్ వైస్ చైర్మన్లు రూపాదేవి, పామర్తి మహేష్, కలిదిండి సత్యనారాయణరాజు, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

చంద్రగ్రహణం.. ఆలయాల మూసివేత

ఆదివారం ఉదయం నుంచి మళ్లీ దర్శనాలు



రత్నగిరిపై సత్యదేవుని ప్రధానాలయ ద్వారాలు మూసివేసిన అర్చకులు, అధికారులు

బోట్‌క్లబ్ (కాకినాడసిటీ): చంద్రగ్రహణం కారణంగా శనివారం సాయంత్రం నుంచి జిల్లాలోని పలు ప్రముఖ ఆలయాల్లో దర్శనాలు నిలిపివేశారు. సంప్రోక్షణ అనంతరం ఆదివారం ఆలయాలు తెరిచి భక్తులకు దర్శనం కల్పించనున్నారు. అన్నవరం వీరవేంకట సత్యనారాయణస్వామి దేవస్థానం సాయంత్రం 5 గంటలు నుంచి ఆదివారం తెల్లవారుజామున 5 గంటలు వరకూ మూసివేశారు. సంప్రోక్షణ అనంతరం ఉదయం 6 గంటలకు స్వామి వారి దర్శనం కల్పించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. పంచారామక్షేత్రమైన సామర్లకోట చాళుక్య కుమారరామా భీమేశ్వరస్వామి దేవస్థానం శనివారం సాయంత్రం నాలుగు గంటలకే మూతపడింది. సంప్రోక్షణ అనంతరం ఆదివారం ఉదయం 9 గంటలు నుంచి భక్తులకు దర్శనం కల్పించేందుకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ నాగమల్లేశ్వరరావు తెలిపారు. జిల్లా కేంద్రమైన కాకినాడ బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానం శనివారం సాయంత్రం ఐదు గంటలకు మూసివేశారు. సంప్రోక్షణ అనంతరం ఆదివారం సాయంత్రం ఐదు గంటలు నుంచి భక్తులకు దర్శనానికి అనుమతిస్తామని ఆలయ ఈఓ చింతపల్లి విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. లోవ దేవస్థానంలో తలుపులమ్మ అమ్మవారి ఆలయం చంద్రగ్రహణం కారణంగా శనివారం సాయంత్రం 5 గంటలకు మూసివేశారు. ఆదివారం ఉదయం 5 గంటలు నుంచి అమ్మవారి దర్శనం కల్పిస్తామని ఆలయ ఈఓ పి.విశ్వనాథరాజు తెలిపారు. వీటితోపాటు జిల్లాలోని పలు ఆలయాలు చంద్రగ్రహణం కారణంగా మూతపడ్డాయి.

3న సామాజిక సాధికార యాత్ర

- సర్పవరంలో బహిరంగ సభ
- విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ శ్రేణులకు ఎమ్మెల్యే కన్నబాబు పిలుపు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురసాల కన్నబాబు

కాకినాడ రూరల్: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన నాలుగున్నర ఏళ్లుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసిన మేలును వివరిస్తూ పేదలందరినీ ఏకం చేస్తూ పెత్తందారులపై రణభేరి మోగించేందుకు సాగుతున్న సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని పార్టీ శ్రేణులకు ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కురసాల కన్నబాబు పిలుపు ఇచ్చారు. రమణయ్యపేట వైద్యనగర్ క్యాంపు కార్యాలయంలో శనివారం వాకలపూడి, తదితర గ్రామాలతో పాటు కాకినాడ అర్బన్ లోని రూరల్ నియోజకవర్గ డివిజన్ల కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. వచ్చే నెల 3న జిల్లాలో రూరల్ నియోజకవర్గంలో సామాజిక సాధికార బస్సు యాత్ర జరుగుతుందన్నారు. సర్పవరం జంక్షన్‌లో బహిరంగ సభ ఉందన్నారు. బస్సు రూట్, హాజరయ్యే అతిథులు తదితర వివరాలను త్వరలో వెల్లడిస్తామన్నారు. బస్సుయాత్ర విజయవంతమయ్యేలా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలన్నారు. అనంతరం నాయకుల వారీగా వారు చేపట్టాల్సిన బాధ్యతలు, జన సమీకరణ తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జోనల్ ఇన్‌చార్జి జమ్మలమడక నాగమణి, తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ, నేమాం సర్పంచ్ రామదేవు సూర్యప్రకాశరావు, అర్బన్ డివిజన్ల క్లస్టరు ఇన్‌చార్జి కడియాల చినబాబు, వాసురెడ్డి సూరిబాబు, పాటి సూరిబాబు, విజయసారథి, గొల్లపల్లి జగన్, జీఎస్ఎన్, దాసరి జగన్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎస్‌జీఎఫ్ఐ ఎంపికలు



వెయిట్‌లిఫ్టింగ్‌లో పోటీ పడుతున్న క్రీడాకారిణి, చిత్రంలో డీఎస్‌ఏ కోచ్ సతీష్‌కుమార్ తదితరులు

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): పాఠశాల క్రీడాసమాఖ్య అండర్–14, 17 ఆధ్వర్యంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిధిలో బాలురు, బాలికల ఎంపికలు జిల్లా క్రీడామైదానంలో శనివారం ఉత్సాహంగా జరిగాయి. వీటిని పాఠశాల క్రీడాసమాఖ్య జిల్లా కార్యదర్శి ప్రసాద్ పర్యవేక్షించారు. జిల్లా విద్యాశాఖ అధికారి నాగమణి ఆదేశాల మేరకు నిర్వహించిన ఎంపికల్లో ఖో–ఖో విభాగంలో 680 మంది, వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో 110 మంది హాజరయ్యారు. ఈ ఎంపికల నిర్వహణలో 75 మంది వ్యాయామ ఉపాధ్యాయులు సేవలు అందించారు. ఖో–ఖో విభాగంలో 48 మంది, వెయిట్‌లిఫ్టింగ్ విభాగంలో 15 మందిని అంతర్ జిల్లాల పోటీలకు ఎంపిక చేశారు. డీఎస్ఏ వెయిట్‌లిఫ్టింగ్ కోచ్ సతీష్‌కుమార్ పర్యవేక్షణలో వెయిట్ లిఫ్టింగ్ క్రీడాకారులను ఎంపిక చేశారు. పీడీ పట్టాభి పర్యవేక్షణలో ఖో–ఖో ఎంపికలు నిర్వహించారు. వ్యాయామ ఉపాధ్యాయులు టీవీఎస్ రంగారావు, కె.నూకరాజు, జార్జి, రవిరాజు, చంద్రావతి, సువర్చల, శ్రీహరిరాజు, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రుల్లో పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

అమలాపురం టౌన్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ఆంధ్రప్రదేశ్ వైద్యవిధాన పరిషత్ ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న పలు పోస్టులను కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ విడుదలైంది. ఫార్మాసిస్ట్ గ్రేడ్-2 పోస్టులు 2, ఆడియో మెట్రీషియన్ పోస్టు-1 కాంట్రాక్ట్ పద్ధతిన, ల్యాబ్ అటెండెంట్ పోస్టు-1 అవుట్ సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు పూర్వపు తూర్పుగోదావరి జిల్లా వైద్య సేవల సమన్వయ అధికారి కార్యాలయం శనివారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ పోస్టుల భర్తీకి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నారు. అభ్యర్థులు శనివారం నుంచి నవంబర్ 3వ తేదీ వరకూ ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తులను కొవ్వూరులోని జిల్లా వైద్య సేవల సమన్వయాధికారి కార్యాలయంలో అందజేయాలి. ఏడాది కాల పరిమితితో ఈ పోస్టులను భర్తీ చేసేందుకు లిమిటెడ్ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ జారీ అయ్యిందని ఆ కార్యాలయం వివరించింది.

మున్సిపల్ ఉద్యోగి అరెస్ట్

మండపేట: స్థానిక గాంధీనగర్‌కు చెందిన బాలుడి (4)పై లైంగిక దాడికి పాల్పడిన మున్సిపల్ ఉద్యోగిని శనివారం పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. మండపేట మున్సిపల్ కార్యాలయంలో రికార్డ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న నాయుడు శ్రీను తమ కుమారుడిని ఆడిస్తానని తీసుకువెళ్లి లైంగిక దాడికి పాల్పడినట్లు రెండు రోజుల కిందట బాలుడి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం విధితమే. ఈ ఘటనపై పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్పీ శ్రీధర్ ఆదేశాల మేరకు దిశా డీఎస్పీ సుంకర మురళీమోహన్ దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని ఆలమూరు జేఎఫ్‌సీఎం కోర్టుకు తరలించారు. త్వరితగతిన దర్యాప్తు పూర్తి చేసి చార్జిషీట్ ఫైల్ చేస్తామని డీఎస్పీ మురళీమోహన్ తెలిపారు. పిల్లల పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండి మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి


మృతి చెందిన దివ్యకుమారి

కొవ్వూరు: స్థానిక ఇందిరమ్మ కాలనీలో ముప్పిడి దివ్యకుమారి (33) అనుమానాస్పద స్థితిలో శనివారం మృతి చెందింది. భర్త మందలించాడనే మనస్తాపంతో ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని మృతి చెందినట్లు పట్టణ సీఐ వి.జగదీశ్వరరావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కాపవరానికి చెందిన దివ్యకుమారికి కొవ్వూరుకు చెందిన రవిబాబుతో నాలుగేళ్ల కిందట వివాహమైంది. వీరికి ఏడాది వయసున్న కుమార్తె ఉంది. శనివారం కుమార్తెను సరిగా చూడడం లేదని భర్త మందలించడంతో పక్క గదిలోకి వెళ్లి ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకున్నట్లు చెబుతున్నారు. తమ కుమార్తె మృతికి భర్త వేధింపులే కారణమని దివ్యకుమారి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. మృతిరాలి బంధువుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

జాతీయస్థాయి సెపక్‌తక్రా పోటీలకు ఎంపిక

అమలాపురం రూరల్: గోవాలో ఈ నెల 30వ తేదీ నుంచి వచ్చే నెల 4 వరకూ జరిగే 37వ జాతీయ స్థాయి సెపక్‌తక్రా పోటీల్లో రాష్ట్ర జట్టులో పాల్గొనేందుకు జిల్లాకు చెందిన ఇద్దరు క్రీడాకారులు ఎంపికయ్యారని కోచ్ యాండ్ర గౌతమ్ తెలిపారు. అమలాపురానికి చెందిన క్రీడాకారులు కేతా సతీష్, చొల్లంగి మోహన్‌కృష్ణ రాష్ట్రం తరపున ఆడతారని వివరించారు. జిల్లా నుంచి నలుగురు జాతీయ స్థాయి క్యాంపునకు వెళ్లగా ఈ ఇద్దరూ ఎంపికయ్యారన్నారు. క్రీడాకారులు సతీష్, మోహన్‌కృష్ణ ఇప్పటికే పది సార్లు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ఎంపికైన క్రీడాకారులతో పాటు కోచ్ యండ్రా గౌతమ్‌ను రాష్ట్ర సెపక్‌తక్రా క్రీడా సంఘ ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాసులు, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ సురేష్‌కుమార్, జిల్లా సెపక్ తక్రా సంఘ కార్యదర్శి మునగాల మన్యం అభినందించారు.

అక్రమ మార్గంలో ఆర్జించాలని..

- హర్యానా నుంచి మద్యం తీసుకొచ్చి విక్రయాలు
- రాజమహేంద్రవరంలో పట్టుబడిన నిందితులు
- 774 మద్యం సీసాల స్వాధీనం, ఆరుగురి అరెస్టు

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): అధిక సొమ్ముకు ఆశ పడ్డారు.. అక్రమ మార్గంలో ఆర్జించాలని ఎత్తులు వేశారు.. చివరికి పోలీసులకు చిక్కి కటకటాల పాలయ్యారు.. హర్యానా మద్యాన్ని అక్రమంగా విక్రయిస్తున్న ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేసిన ఘటన రాజమహేంద్రవరంలో చోటుచేసుకుంది. హర్యానా నుంచి ఎన్‌డీపీ లిక్కర్‌ను రాజమహేంద్రవరానికి తరలించి విక్రయిస్తున్న ఆరుగురిని అరెస్టు చేసినట్లు జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ (అడిషనల్ ఎస్పీ) పిట్టా సోమశేఖర్ తెలిపారు. శనివారం సాయంత్రం ఎస్ఈబీ రాజమహేంద్రవరం సౌత్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. బొమ్మూరు గ్రామానికి చెందిన శెట్టి నాగేశ్వరరావు, తులుగు రమేష్, పిసిని సురేష్, ఉండ్రాజవరానికి చెందిన మాస రవి, రాజమహేంద్రవరం సంజీవనగర్‌కు చెందిన ఏడాకుల నాగదుర్గాప్రసాద్, దేవరపల్లికి చెందిన చెల్లింకి చిన్నబాబులు కొంతకాలంగా హర్యానా నుంచి మద్యాన్ని కొనుగోలు చేసి వాటిని ఇక్కడకు తీసుకొచ్చి ఎటువంటి అధికార పత్రాలు లేకుండా అధిక ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. శనివారం సాయంత్రం ఓ లారీలో 63 అట్టపెట్టెలలో 774 మద్యం సీసాలను దివాన్‌చెరువు ఆటోనగర్ సెంటర్ వేయింగ్ మెషీన్ వెనుక ప్రదేశంలో పెట్టి అక్రమంగా విక్రయిస్తున్నారు. ఎస్ఈబీ డిస్ట్రిక్ట్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ పిట్టా సోమశేఖర్ ఆదేశాల మేరకు, ఎస్ఈబీ రాజమహేంద్రవరం సౌత్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీకు వచ్చిన సమాచారం మేరకు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ పి.అప్పారావు, సౌత్ ఎస్సై పి.చిట్టిబాబు, సిబ్బందితో కలసి దాడులు చేశారు. ఈ సందర్భంగా పైఆరుగురు నిందితులను అరెస్టుచేసి, హర్యానాకు చెందిన 774 ఎన్‌డీపీఎల్ మద్యం సీసాలను, లారీని స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రిమాండ్‌కు తరలించనున్నట్లు ఏఎస్పీ తెలిపారు. హర్యానాలో మద్యం సరఫరా చేసిన వికాస్‌వర్మను అరెస్టు చేయాల్సి ఉందన్నారు. హర్యానాలో ఈ మద్యం విలువ రూ.3.47 లక్షలు కాగా, ఆంధ్రప్రదేశ్‌లో రూ.10.46 లక్షలు ఉంటుందన్నారు.


స్వాధీనం చేసుకున్న మద్యం పెట్టెలు, నిందితులను చూపుతున్న ఎస్ఈబీ ఏఎస్పీ పిట్టా సోమశేఖర్

ఆర్థికంగా ఎదిగేందుకే...

అప్పులపాలైన లారీ యజమాని కం డ్రైవర్ శెట్టి నాగేశ్వరరావు ఢిల్లీకి కిరాయికి వెళ్లి తిరిగి వస్తుండగా హర్యానా తదితర ప్రాంతాల్లో మద్యం కొనుగోలు చేసి రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాలలో మిగిలిన నిందితులతో కలసి మద్యం విక్రయించడం ద్వారా సొమ్ము సంపాదిస్తున్నాడు. గతంలో తక్కువగా మద్యం తీసుకువచ్చే నాగేశ్వరరావు ఈ సారి 75 పెట్టెలను తీసుకువచ్చి అందులో 12 పెట్టెలను ఇతర లారీ డ్రైవర్లకు విక్రయించాడని ఎస్ఈబీ ఏఎస్పీ సోమశేఖర్ తెలిపారు. ఎక్కడైనా మద్యాన్ని అక్రమంగా రవాణా చేసినా, అధిక ధరలకు అమ్మినా ఎస్ఈబీ నంబరు 14500కు గాని, డయల్ 100కు గాని, దగ్గరలోని పోలీస్ స్టేషన్‌కు కాని కాల్‌చేసి సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. ఎన్‌డీపీఎల్ మద్యాన్ని పట్టుకున్న ఇన్‌స్పెక్టర్, సిబ్బందికి రివార్డుల కోసం ఎస్ఈబీ కమిషనర్‌కు సిఫార్సు చేస్తామన్నారు. సమావేశంలో సౌత్ ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ, ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ పి.అప్పారావు, ఎస్సై చిట్టిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

రూ. వెయ్యి కోట్ల కార్గో ఆదాయం లక్ష్యం

ఆర్టీసీ బోర్డు డైరెక్టర్ రాజారెడ్డి వెల్లడి


ఆర్టీసీ డిపో ఆవరణలో మొక్క నాటిన ఏపీఎస్ ఆర్టీసీ బోర్డు డైరెక్టర్ రాజారెడ్డి తదితరులు

కాకినాడ: సరకు రవాణా ద్వారా 2023- 24 ఆర్థిక సంవత్సరానికి రూ.వెయ్యి కోట్ల ఆదాయాన్ని ఆర్జించాలన్నదే లక్ష్యమని ఏపీఎస్ ఆర్టీసీ బోర్డు డైరెక్టర్ ఎ.రాజారెడ్డి అన్నారు. శనివారం ఆయన కాకినాడ ఆర్టీసీ డిపోను సందర్శించారు. అక్కడ జరుగుతున్న సరకు రవాణా, డోర్ డెలివరీ విధానం, డిపో పరిసరాలను పరిశీలించారు. గ్యారేజ్ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడం ద్వారా సరకు రవాణా సేవలను మరింత విస్తృతం చేయాలన్నారు. ముఖ్యంగా బల్క్ ట్రాన్స్‌పోర్టుపై దృష్టి పెట్టాలని సూచించారు. వాణిజ్యపరంగా అభివృద్ధి చెందుతున్న కాకినాడ వంటి ప్రాంతాల్లోని రేవు కార్యకలాపాలు, ఇతర అంశాలను దృష్టిలో ఉంచుకుని ఆయా వర్గాలను స్వయంగా కలసి ఆర్టీసీ అందిస్తోన్న సరకు రవాణా సేవలను అర్థమయ్యేలా వివరించాలన్నారు. తక్కువ ఖర్చుతో సురక్షితంగా సేవలందిస్తున్న విధానాన్ని అన్నివర్గాలకు తెలిపాలని కోరారు. జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ సరకు రవాణా ద్వారా గత ఏడాది లక్ష్యాన్ని అధిగమించామని, ఈ ఏడాది సుమారు 37 శాతం లక్ష్యాన్ని చేరుకున్నామని చెప్పారు. కాకినాడ ప్రాంతంలో ఆక్వా ఎగుమతులు, ఎరువులు, ఎరువుల పరిశ్రమలతో పాటు మరెన్నో కార్యకలాపాలు జరుగుతున్నాయన్నారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా సరకు రవాణా పెంచేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఇందుకోసం కార్గో వాహనాన్ని సమకూర్చాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో కార్గో సీటీఎం రమణ, వివిధ డిపోల మేనేజర్లు ఎంయూవీ మనోహర్, జీవీవీ సత్యనారాయణ, కార్గో ఏటీఎం మాధవ్, అసిస్టెంట్ మేనేజర్లు టి.బాలకృష్ణ, మాలిం బాషా, జీజీవీ రమణ, స్టేషన్ మేనేజర్ జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఫుడ్ టెక్నాలజీ రంగానికి అధిక ప్రాధాన్యం

- 'నన్నయ' యూనివర్సిటీ వీసీ ఆచార్య పద్మరాజు
- ఫుడ్ టెక్నాలజీ కోర్సుపై సీఎస్ఆర్ఐతో ఒప్పందం


ఎంఓయూ ప్రతులను మార్చుకుంటున్న ప్రతినిధులు

రాజానగరం: దేశంలోని బెంగళూరు, హైదరాబాద్ వంటి మెట్రో నగరాల్లో ఐటీ తరువాత ఫుడ్ టెక్నాలజీ రంగానికే అధిక ప్రాధాన్యం ఉందని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.పద్మరాజు అన్నారు. 2024లో తొమ్మిది మిలియన్ల ఉద్యోగావకాశాలు ఈ రంగంలోనే లభిస్తాయన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని అన్నపూర్ణ జిల్లాలుగా పేరొందిన ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లోని యువతకు సరైన ఉపాధి అవకాశాలను కల్పించాలనే ఉద్దేశంతో 'నన్నయ' వర్సిటీలో ఎంఎస్సీ ఫుడ్ టెక్నాలజీ కోర్సును ప్రవేశ పెడుతున్నామన్నారు. రెండేళ్ల వ్యవధితో కూడిన ఈ కోర్సును సమర్థవంతంగా నిర్వహించేందుకు మైసూరులోని కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఆర్ఐ), సెంట్రల్ ఫుడ్ టెక్నొలాజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌తో 'నన్నయ' యూనివర్సిటీ అవగాహన ఒప్పందం చేసుకుంది. ఇందుకు సంబంధించిన రాత ప్రతులను యూనివర్సిటీ కన్వెన్షన్ హాలులో శనివారం జరిగిన కార్యక్రమంలో సీఎస్ఆర్ఐ, సీఎఫ్‌టీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ శ్రీదేవి అన్నపూర్ణసింగ్, నన్నయ రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్‌లు సంతకాలు చేసి పరస్పరం మార్చుకున్నారు. ఈ సందర్భంగా వీసీ పద్మరాజు మాట్లాడుతూ ఈ ఒప్పందం ద్వారా కోర్సుకు అవసరమైన మార్గనిర్దేశం చేయడం, ప్రోగ్రామ్ రూపకల్పన కోసం నిపుణులను బీఓఎస్‌కి నామినేట్ చేయడం, అతిథి ఉపన్యాసాలను నిర్వహించడం, చెల్లింపు ప్రాతిపదికన విద్యార్థులకు ప్రాజెక్టు వర్కును ఆఫర్ చేయడం వంటి ప్రయోజనాలు అందుతాయన్నారు. అలాగే యూనివర్సిటీ పరంగా ప్రాంతీయ, సంప్రదాయ, ముడి పదార్థాలపై సర్వేలు నిర్వహించడం, ప్రాసెసింగ్ డేటా సేకరణ, వర్క్‌షాప్‌లు, సెమినార్లు తదితర వాటి నిర్వహణ చేస్తారన్నారు. సీఎస్ఆర్ఐ, సీఎఫ్‌టీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ శ్రీదేవి అన్నపూర్ణసింగ్ మాట్లాడుతూ ఈ ఎంఓయూ ద్వారా నూతన ఫుడ్ టెక్నాలజీ విషయాలు ప్రాక్టికల్‌గా అర్థమవుతాయన్నారు. నాణ్యమైన ఆరోగ్యవంతమైన జీవనంలో ఫుడ్ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. దేశంలోని ప్రముఖ జాతీయ, అంతర్జాతీయ సంస్థలతో సీఎఫ్‌టీఆర్ఐ సంబంధం కలిగి ఉందన్నారు. ఈ అనుబంధంలోకి 'నన్నయ' వర్సిటీ కూడా రావడం హర్షణీయమన్నారు. వైఎస్సార్ హార్టీకల్చర్ యూనివర్సిటీ వీసీ ఆచార్య తోలేటి జానకిరామ్, డిపార్టుమెంట్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీ ప్రొఫెసర్ ఆచార్య పి.రామకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.విజయనిర్మల, డీన్ ఆచార్య వై.శ్రీనివాసరావు, హెచ్ఓడీ డాక్టర్ డి.కల్యాణి పాల్గొన్నారు.

లక్ష మందితో మాదిగ, ఉపకులాల కలయిక

ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్


ఐక్యత చాటుతున్న ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, మాదిగ సంఘాల నాయకులు

అమలాపురం రూరల్: అమలాపురంలో డిసెంబర్ 11న లక్ష మంది మాదిగ, మాదిగ ఉపకులాలతో రాజకీయ ఆత్మీయ కలయిక సభ నిర్వహిస్తామని మాదిగల పొలిటికల్ జేఏసీ చైర్మన్, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ తెలిపారు. నడిపూడిలోని బాబూ జగ్జీవన్‌రామ్ కమ్యూనిటీ హాలులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని 16 మండలాల మాదిగ సంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ ఈ సభకు రాష్ట్రంలోని అధికార పార్టీ మాదిగ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో పాటు ప్రతిపక్ష పార్టీల మాదిగ నాయకులు పాల్గొంటారన్నారు. మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజలంతా విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు యార్లగడ్డ సత్తిబాబు, మల్లిపూడి రాజు, ఆకుమర్తి రమేష్, చాట్ల రామారావు, యు.నాగబాబు, క్రాప నాగభూషణం, మడికి శ్రీరాములు, యార్లగడ్డ రవీంద్ర, ఆకుమర్తి సత్యనారాయణ, ముమ్మిడివరపు శ్రీను, చెట్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో భవన నిర్మాణ కార్మికుడి మృతి

అమలాపురం టౌన్: అమలాపురం హైస్కూల్ సెంటర్‌లో నిర్మాణంలో ఉన్న ఓ షాపింగ్ మాల్‌లో పనిచేస్తున్న ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు సత్యంకుమార్ (20) విద్యుత్ షాక్‌కు గురై శనివారం మధ్యాహ్నం దుర్మరణం పాలయ్యాడు. అతడు విద్యుత్ షాక్‌కు గురై అపస్మారక స్థితిలో వెళ్లిన మరుక్షణమే తోటి కార్మికులు సమీపంలో ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి అత్యవసర వైద్యం కోసం తరలించారు. అప్పటికే సత్యంకుమార్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. దీంతో మృతదేహాన్ని అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కార్మికుడి మృతి మెడికో లీగల్ కేసు అవుతుందని, ఆ మృతదేహాన్ని ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచామని, అతని కుటుంబీకులు వచ్చాక పోస్టుమార్టం నిర్వహిస్తామని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు తెలిపారు. షాపింగ్ మాల్‌లో ఇంటీరియల్ డెకరేషన్ పనుల కోసం ఉత్తరప్రదేశ్ రాష్ట్రం నుంచి అమలాపురానికి వచ్చిన సత్యంకుమార్ ఆ పనిలో ఉండగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు.


ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన సత్యంకుమార్ మృతదేహం